

అమృతకాలంలో అద్భుత ప్రగతి



ప్రతి రంగంలోనూ భారత్‌ను అగ్రగామి దేశంగా నిలబెట్టే కృషిలో భాగంగా గత పదేళ్ల అమృత కాలంలో మోదీ ప్రభుత్వం సాధించిన మైలురాళ్లపై బడ్జెట్ ప్రసంగం వెలుగులు ప్రసరించింది. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను చూడాలన్న మోదీ దార్శనికతకు ఇది మార్గనిర్దేశం చేస్తోంది. ఈ ప్రగతి పునాదులపైనే వికసిత భారత్ అనే అద్భుతమైన భవన నిర్మాణం జరుగుతుంది.

– అమిత్ షా, కేంద్ర హోం మంత్రి

జవాబుదారీతనం, దార్శనికత లేవు



కేంద్ర ఆర్థికమంత్రి గత ప్రభుత్వంపై శ్వేతపత్రం ప్రకటిస్తామన్నారు. ఇప్పుడు మోదీ సర్కారును మేము అడుగుతున్నాం. గత పదేళ్లుగా మీరు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారు? ప్రజలకు పెద్ద పెద్ద కలలను చూపించారు. పేర్లు మార్చి పాత పథకాలనే మళ్లీ ప్రారంభించారు. ఈ బడ్జెట్‌లో జవాబుదారీతనం, దార్శనికత రెండూ లేవు. ఇబ్బందులు పడుతున్న పేదలు, మధ్యతరగతి వారి కోసం కొత్త పథకాలు తెస్తారని ఎదురు చూస్తే నిరాశే మిగిలింది.

– మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అధ్యక్షుడు




రక్షణకు ఓ మోస్తరు పెంపు

డీప్-టెక్ సాంకేతికతల బలోపేతానికి కొత్త పథకం! • 'ఆత్మ నిర్భరత'కు పెద్దపీట

దిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రక్షణ శాఖకు ఒక మోస్తరు స్థాయిలో కేటాయింపులు పెంచారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ పద్దు కింద రూ.6.21 లక్షల కోట్లు ప్రతిపాదించారు. మొత్తం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఇది 13.04 శాతం. గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.5.94 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 4.72 శాతం అధికం. తూర్పు లద్దాఖ్‌లో చైనాతో సరిహద్దు వివాదం కొనసాగడం, వ్యూహాత్మక జలాల్లో మారుతున్న భద్రత పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

- తాజా రక్షణ పద్దులో రూ.1.72 లక్షల కోట్లను పెట్టుబడి వ్యయంగా నిర్ధరించారు. కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధనౌకలు, ఇతర సాధన సంపత్తికి దీన్ని వెచ్చిస్తారు. 2023-24 బడ్జెట్‌లో ఈ పద్దు కింద రూ.1.62 లక్షల కోట్లు కేటాయించగా సవరించిన అంచనాల ప్రకారం అది రూ.1.57 లక్షల కోట్లుగా ఉంది. వాస్తవ వ్యయంతో పోలిస్తే గత బడ్జెట్ కన్నా ఈసారి 9.40 శాతం మేర పెట్టుబడి వ్యయాన్ని పెంచారు.
- పెట్టుబడి వ్యయంలో విమానాలు, ఏరో ఇంజిన్ల కోసం రూ.40,777 కోట్లు, ఇతర సాధన సంపత్తి కోసం రూ.62,343 కోట్ల కేటాయింపు.
- రెవెన్యూ వ్యయం కింద రూ.4,39,300 కోట్లు. అందులో రక్షణ శాఖ పెన్షన్లకు రూ.1,41,205 కోట్లు. రెవెన్యూ వ్యయంలో సైన్యానికి రూ.1,92,680 కోట్లు, నౌకాదళానికి రూ.32,778 కోట్లు, వాయుసేనకు రూ.46,223 కోట్లు.
- సరిహద్దుల్లో మౌలిక వసతుల బలోపేతానికి రూ.6,500 కోట్లు, తీర రక్షణ దళానికి రూ.7,651 కోట్లు.
- రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కు రూ.23,855 కోట్లు.
- రక్షణ రంగంలో అధునాతనమైన డీప్-టెక్ సాంకేతిక పరిజ్ఞానాల బలోపేతానికి ఒక కొత్త పథకాన్ని తీసుకురానున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆయుధ ఉత్పత్తిలో ఆత్మ నిర్భరత (స్వయం సమృద్ధి)కు పెద్దపీట వేశారు.



అంతర్గత భద్రతకు ప్రాధాన్యం

'హోం'కు రూ.2 లక్షల కోట్లు దాటిన కేటాయింపులు

దిల్లీ: బడ్జెట్‌లో కేంద్ర హోంశాఖకు రూ.2,02,868.70 కోట్లను ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. ఇందులో సింహభాగాన్ని.. సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ వంటి పారామిలటరీ బలగాలకు ప్రత్యేకించారు. తద్వారా అంతర్గత భద్రత, సరిహద్దు రక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. మొత్తం మీద కేంద్ర పోలీసు బలగాలకు రూ.1,32,345.47 కోట్లు ప్రతిపాదించారు. గత బడ్జెట్‌లో హోంశాఖకు రూ.1,96,034.94 కోట్లను కేటాయించారు.

- తాజా మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర కేబినెట్‌కు రూ.1,248.91 కోట్లు ప్రతిపాదించారు. మంత్రిమండలి, కేబినెట్ సెక్రటేరియట్, ప్రధాన మంత్రి కార్యాలయ వ్యయాలతోపాటు ప్రభుత్వ అతిథులకు ఆతిథ్యం, వినోద ఖర్చులకు ఈ మొత్తాన్ని వినియోగిస్తారు. గత బడ్జెట్‌లో ఈ పద్దు కింద రూ.1,803.01 కోట్లు కేటాయించారు.
- వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా వ్యయం, ప్రత్యేక మౌలిక వసతుల పథకం కింద రూ.3,199.62 కోట్లు, సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి కోసం రూ.335 కోట్లు, సురక్షిత నగర ప్రాజెక్టులకు రూ.214.44 కోట్లు, ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు రూ.330 కోట్లు కేటాయించారు.



ప్రతి దీవీ.. పర్యాటక దివిటీ!

లక్షద్వీప్‌తో సహా దేశీయ పర్యాటకానికి ప్రోత్సాహం

దిల్లీ: దేశీయ పర్యాటక అభివృద్ధికి కంకణం కట్టుకున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ముఖ్యంగా లక్షద్వీప్, ఇతర దీవులను పర్యాటకంగా సిద్ధం చేయనున్నట్లు ప్రకటించారు. మౌలిక వసతులు, పోర్టుల అనుసంధానం, సౌకర్యాల కల్పనకు ఊతం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

కేంద్ర మంత్రి ఇంకేమన్నారంటే..

- పర్యాటక ప్రాంతాల్లో వసతులు, సేవల ఆధారంగా వాటికి రేటింగ్ ఇస్తాం. ఇందుకు ఫ్రేమ్‌వర్క్ రూపొందిస్తాం.
- ఆయా కేంద్రాల అభివృద్ధికి రాష్ట్రాలను కలుపుకొని ఆర్థికంగా చేయూత ఇస్తాం.
- వడ్డీ లేని దీర్ఘకాలిక రుణాలతో రాష్ట్రాలను పర్యాటకరంగం వైపు దృష్టిసారించేలా ప్రోత్సహిస్తాం.
- దేశీయంగా లక్షద్వీప్ వంటి దీవుల్లో పోర్టు కనెక్టివిటీ, ఇన్‌ఫ్రా టూరిజం ఏర్పాటు చేస్తాం. ఫలితంగా ఉద్యోగాలు సృష్టించినట్లవుతుంది.

పోషణ్ 2.0కు రూ.21,200 కోట్లు

దిల్లీ: మహిళా శిశు సంక్షేమ శాఖకు 2024-25 బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగాయి. గతం కంటే 2.52 శాతం నిధులను పెంచి రూ.26,000 కోట్లను కేటాయించారు. వీటిల్లో వివిధ పథకాల ఉమ్మడి కార్యక్రమమైన పోషణ్ 2.0కు అత్యధికంగా రూ.21,200 కోట్లను ఖర్చు చేయనున్నారు. అంగన్‌వాడీ సర్వీసులు, పోషణ్ అభియాన్ తదితర పథకాలు పోషణ్ 2.0లో భాగంగా ఉన్నాయి.



మహిళల రక్షణ, స్వయంఉపాధికి ప్రారంభించిన మిషన్ శక్తికి రూ.3,145.97 కోట్లు, బాలల రక్షణ, సంక్షేమానికి ఉద్దేశించిన మిషన్ వాత్సల్యకు రూ.1,472 కోట్లను కేటాయించారు. ఈ శాఖ కింద పనిచేసే స్వతంత్ర సంస్థలు కేంద్రీయ దత్తత సంసాధన సంస్థ (సీఏఆర్ఏ), జాతీయ బాలల రక్షణ, హక్కుల కమిషన్ (ఎన్సీపీసీఆర్), జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ)లకు గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.15 కోట్లు కోత విధించి రూ.153 కోట్లు కేటాయించారు.

ముద్రా యోజనతో రూ. 22.5 లక్షల కోట్ల రుణాలు

జన్‌ధన్ ఖాతాల్లో పొదుపు మొత్తం రూ.2.7 లక్షల కోట్లు

దిల్లీ: ముద్రా యోజన కింద 43 కోట్ల రుణాలను అందించామని.. ఆ రుణాల విలువ రూ.22.5 లక్షల కోట్లని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. జన్‌ధన్ ఖాతాల ద్వారా ఇప్పటి వరకు రూ.34 లక్షల కోట్లను లబ్ధిదారులకు బదిలీ చేయగా.. వాటిల్లో పొదుపు మొత్తం రూ.2.7 లక్షల కోట్లుగా ఉందని తెలిపారు. గత పదేళ్లలో మహిళలకు 30 కోట్ల ముద్ర రుణాలను అందించామని వెల్లడించారు. అర్హుల్లో చివరి వ్యక్తికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని.. ఇదే నిజమైన సామాజిక న్యాయం, లౌకికత్వం అని ఆర్థికమంత్రి పేర్కొన్నారు.



జనగణన మరింత ఆలస్యం!

- **కేటాయింపులు తగ్గడమే కారణం**

దిల్లీ: బడ్జెట్‌లో జనాభా లెక్కల కోసం రూ.1,277.80 కోట్లను కేటాయించారు. ఇది మూడేళ్ల క్రితం కంటే చాలా తక్కువ. 2021-2022లో జనగణనకు రూ.3,768 కోట్లను ప్రతిపాదించినప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు. ఈ ఏడాది అంతకన్నా తక్కువ కేటాయించడంతో జనాభా లెక్కలు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. రూ.8,754 కోట్లతో 2021లో జనగణన చేపట్టాలని, రూ.3,941 కోట్లతో జాతీయ జనాభా నమోదు నవీకరించాలని గతంలో కేబినెట్ నిర్ణయించింది. 2020 ఏప్రిల్ 1నుంచి సెప్టెంబరు 30 వరకు ప్రక్రియ పూర్తి కావాలని ప్రణాళికలు చేసినా ఫలించలేదు. తర్వాత ఇప్పటివరకూ కొత్తగా ప్రకటన చేయలేదు. సార్వత్రిక ఎన్నికలు ఉన్న కారణంగా ఈ ఏడాదీ జనగణన చేపట్టే అవకాశాలు లేవని అధికారులు తెలిపారు.



ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయం నుంచి పార్లమెంటుకు బయలుదేరేముందు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రులు పంకజ్ చౌధరి, భగవత్ కరాడ్, ఉన్నతాధికారులు


నేడు ఇండియా కూటమి నేతల భేటీ

దిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని వివిధ అంశాలపై ఇరుకున పెట్టేందుకు అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహం రూపొందించేందుకు ఇండియా కూటమిలోని పలు పార్టీల నేతలు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో వీరు భేటీ కానున్నారు.

జ్ఞానవాపిలో తెరచుకున్న వ్యాస్‌జీ మందిరం

- **మూడు దశాబ్దాల తర్వాత పూజలు**
- **అలహాబాద్ హైకోర్టులో మసీదు కమిటీ పిటిషన్**

వారణాసి: జ్ఞానవాపి మసీదు ప్రాంగణం సెల్లార్‌లోని వ్యాస్‌జీ మందిరం తలుపులు 31 ఏళ్ల తర్వాత బుధవారం రాత్రి తెరచుకున్నాయి. అక్కడున్న లక్ష్మీదేవి, గణేశుడి ప్రతిమలకు హారతి, అర్చన నిర్వహించినట్లు కాశీ విశ్వనాథ ఆలయం ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు. దీని కోసం పూజారి కుటుంబానికి వారణాసి జిల్లా కోర్టు బుధవారం అనుమతి మంజూరు చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలు వెలువడిన గంటల వ్యవధిలోనే భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య సీలువేసిన సెల్లార్ మార్గాన్ని తెరిచారు. రాత్రి 9.30 గంటల సమయంలో మందిరాన్ని శుభ్రం చేశారని, 10.30కి హారతి ఇచ్చారని అధికారులు తెలిపారు. అంతకుముందు మసీదు ప్రాంగణంలోని వజూఖానాకు ఎదురుగా ఉన్న నంది విగ్రహం చెంతనున్న బారికేడ్లను జిల్లా యంత్రాంగం తొలగించింది. అయితే, సెల్లార్‌లో పూజలకు వారం రోజుల్లో ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులను వారణాసి కోర్టు ఆదేశించగా... గంటల వ్యవధిలోనే హడావుడిగా తలుపులు తెరవాల్సిన అవసరం ఏమిటని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. మసీదులో శుక్రవారం ప్రార్థనలకు భారీ




సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

హైకోర్టుకు వెళ్లండి: సుప్రీం

దిల్లీ: వ్యాస్‌జీ మందిరంలో పూజల నిర్వహణకు వారణాసి జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించే ప్రయత్నం చేసింది. మసీదు కమిటీ తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌ను కలిసి సత్వరమే కేసు విచారణకు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని రిజిస్ట్రార్.. సీజేఐ దృష్టికి తీసుకెళ్లగా.. అలహాబాద్ హైకోర్టుకు వెళ్లాలని సూచించారు. జిల్లా యంత్రాంగం అవతలి పక్షంతో కుమ్మక్కై వెంటనే పూజలు ప్రారంభమయ్యేలా చేసిందని మసీదు కమిటీ ఆరోపించింది. ఈ మేరకు అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

అలీగఢ్ వర్సిటీకి మైనారిటీ హోదాపై తీర్పు రిజర్వు

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ)కి మైనారిటీ హోదా పునరుద్ధరణపై రోజుల తరబడి జరిగిన వాడీవేడి చర్చల అనంతరం గురువారం సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వులో పెట్టింది. ఎనిమిది రోజులపాటు ప్రత్యర్థి వర్గాల వాదనలు విన్న సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పును రిజర్వు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మనోజ్ మిశ్ర, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ మిగతా సభ్యులుగా ఉన్నారు. ఏఎంయూకు మైనారిటీ హోదా అంశం కొన్ని దశాబ్దాలుగా చట్టపరమైన చిక్కుల్లో నలుగుతోంది. ఈ కేసు విచారణను ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి కేటాయిస్తూ సుప్రీంకోర్టు 2019లో ఆదేశాలు జారీ చేసింది. ఏఎంయూ కేంద్రీయ విశ్వవిద్యాలయం కాబట్టి, మైనారిటీ సంస్థగా పరిగణించలేమని అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 1967 నాటి ఎస్.అజీజ్ బాషా వర్సెస్ యూనియన్ ఆఫ్



ఇండియా కేసులో స్పష్టం చేసింది. అయినప్పటికీ 1981లో పార్లమెంటు ఆమోదించిన సవరణ చట్టంతో మైనారిటీ హోదా పొందింది. 2006లో అలహాబాద్ హైకోర్టు ఈ నిబంధనను కొట్టివేసింది. దీనిపై అప్పటి యూపీఏ సర్కారు అప్పీలుకు వెళ్లింది. యూనివర్సిటీ కూడా ప్రత్యేక పిటిషను దాఖలు చేసింది. యూపీఏ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలును ఉపసంహరించుకుంటామని ఎన్డీయే సర్కారు 2016లో సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. ప్రభుత్వ నిధులు పొందుతున్న ఏఎంయూ మైనారిటీ సంస్థ కాదన్న కేంద్ర ప్రభుత్వం 1967 నాటి సుప్రీం తీర్పును ఉటంకించింది.

తొలగిన ఝార్ఖండ్ అనిశ్చితి

- **చంపయీని సీఎంగా నియమించిన గవర్నర్**
- **ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం**
- **ఈడీ కేసుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన సోరెన్**
- **విచారణకు ప్రత్యేక ధర్మాసనం**
- **ఒకరోజు కస్టడీకి మాజీ సీఎం**

దిల్లీ, రాంచీ: నగదు అక్రమ చలామణి కేసులో ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టయిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి వీడింది. 81 మంది ఎమ్మెల్యేలున్న శాసనసభలో తనకు 48 మంది మద్దతు ఉందని, ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని జేఎంఎం శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన చంపయీ సోరెన్ రెండోసారి కూడా చేసిన వినతిపై గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ గురువారం రాత్రి పొద్దుపోయాక నిర్ణయం తీసుకున్నారు. సీఎంగా ఆయన్ని నియమిస్తూ, పదవీ ప్రమాణం స్వీకరించడానికి ఆహ్వానించారు. ఆయన నిర్ణయం ఒక పట్టాన రాకపోవడంతో రాజకీయపక్షాలు తొలుత కలవరపడ్డాయి. చంపయీ మరోసారి గవర్నర్‌ను కలిసి.. ప్రలోభాలకు ఆస్కారం లేకుండా చూడాలంటే కొత్త సర్కారుపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతున్న నేతను ప్రభుత్వ ఏర్పాటుకు పిలవకపోవడం రాజ్యాంగ ఉల్లంఘనే అని, ప్రజాతీర్పును కాలరాసినట్లు అవుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని గవర్నర్లు భూస్థాపితం చేస్తున్నారని మండిపడ్డారు. పైనుంచి ఆదేశాల కోసం గవర్నర్ నిరీక్షిస్తున్నారా అని మరో సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ ప్రశ్నించారు. ఈ తరుణంలో దాదాపు అర్ధరాత్రి సమయంలో గవర్నర్ నిర్ణయం వెల్లడయింది.



రాజ్‌భవన్ వద్ద జేఎంఎం నేత చంపయీ సోరెన్

సుప్రీంకోర్టులో త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటు

అరెస్టును సవాల్ చేస్తూ హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తొలుత ఆయన ఝార్ఖండ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. గురువారం ఉదయం దానిపై ధర్మాసనం విచారించాల్సి ఉంది. ఆ సమయంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ తదితరులు వ్యూహం మార్చి, నేరుగా సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించారు. హైకోర్టులో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనానికి వారు తెలిపారు. కుట్రలో భాగంగానే ఈడీ తనను అరెస్టు చేసిందని సోరెన్ తన పిటిషన్లో ఆరోపించారు. రాజీనామా సమర్పణకు రాజ్‌భవన్‌కు వెళ్తే అక్కడే అరెస్టు చేయడం అన్యాయమన్నారు. శుక్రవారం విచారణ చేపడతామని సీజేఐ ప్రకటించారు. దీనికోసం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో ఆయనొక ధర్మాసనాన్ని ఏర్పాటుచేశారు. సోరెన్‌ను రాంచీలోని పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. పదిరోజుల కస్టడీకి అప్పగించాలని ఈడీ కోరగా తీర్పును శుక్రవారం వెలువరిస్తానని న్యాయమూర్తి ప్రకటించారు. అంతవరకు జుడీషియల్ కస్టడీ నిమిత్తం బిర్సా ముండా కేంద్ర కారాగారానికి సోరెన్‌ను తరలించారు.

జీవితమంటే పోరాటం: హేమంత్

అరెస్టు తర్వాత 'ఎక్స్' వేదికగా సోరెన్ ఒక హిందీ పద్యాన్ని పంచుకున్నారు. 'జీవితం ఒక గొప్ప పోరాటం. ప్రతి క్షణం నేను పోరాడాను. అలా పోరాడుతూనే ఉంటానే గానీ రాజీ కోసం ప్రాధేయపడను' అని ఆ పద్యం అర్థాన్నిస్తుంది. అరెస్టుకు ముందు సోరెన్ ఓ వీడియోను రికార్డు చేశారు. 'అరెస్టుకు నేనేమీ బాధపడటం లేదు. ఈడీ ఎలాంటి ఆధారాలనూ చూపలేదు. దిల్లీ నివాసంలో సోదాలు నిర్వహించి నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు యత్నించింది' అని అన్నారు.



ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను బిర్సాముండా జైలుకు తరలిస్తున్న అధికారులు

హైదరాబాద్‌కు పయనమై రాంచీలోనే ఆగిపోయి...

ఈనాడు, హైదరాబాద్: రాజకీయ పరిణామాల నేపథ్యంలో జేఎంఎం నేతృత్వంలోని అధికార కూటమి తొలుత తమ ఎమ్మెల్యేలను రెండు ప్రైవేటు విమానాల్లో హైదరాబాద్‌కు తరలించే ఏర్పాట్లు చేసినా రాంచీ విమానాశ్రయంలో భారీ పొగమంచు కారణంగా అవి అక్కడి నుంచి బయల్దేరలేకపోయాయి. ఏఐసీసీ నిర్ణయం మేరకు గురువారం రాత్రికే 43 మంది ఎమ్మెల్యేలు హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. ఇందుకోసం కాంగ్రెస్ నేతలు వసతి ఏర్పాట్లు చేశారు. బేగంపేట విమానాశ్రయంలో రాత్రి 10 గంటల వరకు ఎదురుచూసి చివరకు రాకపోవడంతో వెనుదిరిగారు.

భారత్‌కు ఎంక్యూ-9బీ డ్రోన్ల విక్రయానికి సై

- **ఆమోదం తెలిపిన బైడెన్ సర్కారు**

వాషింగ్టన్: భారత్‌కు 31 ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్లను విక్రయించేందుకు బైడెన్ సర్కారు గురువారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు అమెరికా కాంగ్రెస్‌కు నోటిఫై చేస్తూ అవసరమైన ధ్రువీకరణను అందజేసినట్లు రక్షణ భద్రత సహకార సంస్థ (డీఎస్‌సీఏ) పేర్కొంది. ఈ లోహవిహంగాల ధర 399 కోట్ల డాలర్లుగా ఉండొచ్చని అంచనా. తాజా నిర్ణయంతో ఈ మెగా ఒప్పందం ఖరారు దిశగా పెద్ద ముందడుగు పడింది. ఆ డ్రోన్ల వల్ల భారత రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కానుంది. సముద్ర మార్గాల్లో గస్తీ, నిఘా మెరుగుపడుతుంది.

ప్రధాని మోదీ గతేడాది జూన్‌లో అమెరికాలో పర్యటించినప్పుడు ఎంక్యూ-9బీ డ్రోన్ల ఒప్పందం గురించి ప్రకటించారు. "ఈ మానవరహిత విమానాలను భారత్‌కు విక్రయించడం వల్ల అమెరికా విదేశాంగ విధానానికి ఊతం లభిస్తుంది. 2 దేశాల వ్యూహాత్మక మైత్రిని బలోపేతం చేయాలన్న జాతీయ భద్రతా లక్ష్యాలను నెరవేరుస్తుంది. మన ప్రధాన రక్షణ భాగస్వామి, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో రాజకీయ సుస్థిరత, శాంతి, ఆర్థిక పురోగతికి చాలా కీలకమైన భారత భద్రతను



మెరుగుపరుస్తుంది" అని డీఎస్‌సీఏ పేర్కొంది. ప్రతిపాదిత ఒప్పందం కింద భారత్.. తన నౌకాదళం కోసం 15 సీ గార్డియన్ డ్రోన్లు, వైమానిక దళం, సైన్యం కోసం ఎనిమిదేసి చొప్పున స్కై గార్డియన్ డ్రోన్లను సమకూర్చుకోనుంది.

హెచ్-1బీ వీసా దరఖాస్తుల రుసుము భారీగా పెంపు

వాషింగ్టన్: నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాలైన హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 తదితర దరఖాస్తుల రుసుమును పెంచుతున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. 2016 తర్వాత ఫీజు పెంపు ఇదే తొలిసారి కాగా.. ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఆదేశాలు అమల్లోకి రానున్నాయి. హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజు ఇప్పటి వరకు 460 డాలర్లు (రూ.38,177) ఉండగా దానిని 780 డాలర్లు (రూ.64,736)గా నిర్ణయించారు. రిజిస్ట్రేషన్ ఫీజును కూడా 10 డాలర్ల (రూ.829) నుంచి 215 డాలర్ల (రూ.17,884)కు పెంచినప్పటికీ రిజిస్ట్రేషన్ పెంపు వచ్చే ఏడాది నుంచి అమలవుతుంది. ఎల్-1 వీసా దరఖాస్తు రుసుము 460 డాలర్ల నుంచి 1,385 డాలర్లకు, ఈబీ-5 వీసాకు సంబంధించి 3,675నుంచి 11,160 డాలర్లకు పెరిగింది. 2024-2033 ఆర్థిక సంవత్సరాల మధ్య వివిధ ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

భారతీయులకు వీసా ఆన్ అరైవల్ సదుపాయం

దుబాయ్: భారత్‌కు చెందిన ఎంపిక చేసిన పాస్‌పోర్టు హోల్డర్లకు దుబాయ్‌లోని ఎమిరేట్స్ ఎయిర్‌లైన్ సంస్థ 'ప్రీ అప్రూవ్ వీసా ఆన్ అరైవల్' సదుపాయాన్ని ప్రారంభించింది. తమ ఎయిర్‌లైన్స్‌లో విమాన ప్రయాణం కోసం బుక్ చేసుకున్నవారికి ఈ సర్వీసు అందుబాటులో ఉంటుందని గురువారం ఆ సంస్థ ప్రకటించింది. ప్రయాణికులు ఆరు నెలల యూఎస్ వీసా, యూఎస్ గ్రీన్‌కార్డు, యూరోపియన్ యూనియన్ లేదా యూకే రెసిడెన్సీని తప్పనిసరిగా కలిగి ఉండాలి. దుబాయ్ వీసా ప్రాసెసింగ్ సెంటర్ జారీ చేసే 14 రోజుల సింగిల్ ఎంట్రీ వీసా.. భారతీయులు దుబాయ్ చేరుకున్న తర్వాత వారి ప్రవేశ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఉపయోగపడుతుంది. ఈ ఎయిర్‌లైన్ అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, దిల్లీ, హైదరాబాద్, కొచ్చిన్, కోల్‌కతా, ముంబయి, తిరువనంతపురంలకు రవాణా సేవలందిస్తోంది.

నిలిచిపోనున్న జిల్లా ఆగ్రోమెట్ యూనిట్‌లు

దిల్లీ: స్థానిక రైతులకు వాతావరణ పరమైన సలహాలు ఇచ్చే జిల్లా ఆగ్రోమెట్ యూనిట్‌లను నిలిపివేయాలని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నిర్ణయించింది. తాజాగా 2023-24 తర్వాత ఇప్పుడు ఉన్న 199 జిల్లా ఆగ్రోమెట్ యూనిట్ (డీఏఎంయూ)లను ఇక నిర్వహించబోమని ఐఎండీ జనవరి 17న ఒక ఉత్తర్వును జారీ చేసింది. సమాచార సేకరణ ఆటోమేటిక్ పద్ధతిలో జరుగుతున్నందున కార్యకలాపాలను కేంద్రీకృతం చేసే ఉద్దేశంతో ఐఎండీ ఈ నిర్ణయం తీసుకుని ఉంటుందని తెలిసింది. కేంద్రం మొత్తం 530 డీఏఎంయూలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినా.. ఆర్థిక కారణాలతో ప్రస్తుతం ఉన్నవాటినే నిలిపివేస్తున్నారు.